# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 163 28-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06









## వెలిగొండ నిర్వాసితులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి..

- వెలిగొండ నిర్వాసితులతో ముగిసిన సీఎం ముఖాముఖి
- తమ కష్టాలు గుర్తించింది చంద్రబాబేనంటూ కన్నీళ్లు పెట్టుకున్న బాధితులు
- గతంలో పునరావాసం అడిగితే అరెస్టులు చేశారంటూ రైతుల ఆవేదన
- 2351 మందికి రూ.300 కోట్ల పునరావాస నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- నిర్వాసితుల త్యాగానికి తగ్గ ఫలితం ఇస్తానని ముఖ్యమంత్రి భరోసా

## ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి

- పాస్‌పోర్ట్, పౌరసత్వంపై ఒవైసీ వ్యాఖ్యలను ఖండించిన కిషన్ రెడ్డి
- ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం
- ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించవద్దని ఒవైసీకి హితవు
- బారిస్టర్ అయిన ఒవైసీ చట్టాలను సరిగా చదవాలన్న కేంద్ర మంత్రి



పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు. బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం-1955, పాస్‌పోర్ట్ చట్టం-1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

## అమరావతిలో పేర్ని నాని తదితర వైసీపీ నేతలపై కోడిగుడ్లతో దాడి

- అమరావతి భూములను పరిశీలించేందుకు వెళ్లిన వైసీపీ నేతలు
- గో బ్యాక్ వైసీపీ అంటూ కూటమి సానుభూతిపరులు, రైతుల అడ్డగింత
- లేళ్ల అప్పిరెడ్డి వాహనంపై రాళ్లు రువ్విన రైతులు

రాజధాని అమరావతి ప్రాంతంలో వైసీపీ సీఆర్‌డీఏ పరిరక్షణ బృందం పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. తాడేపల్లి మండలం ఉండవల్లి సెంటర్ వద్ద వైసీపీ నేతలు పేర్ని నాని, అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు రాజధాని భూములను పరిశీలించేందుకు

2లో



## 'నాకు ఏం జరిగినా రేవంత్ రెడ్డిదే బాధ్యత'..

- సెక్యూరిటీ తొలగింపుపై ఆర్ఎస్ ప్రవీణ్ ఆగ్రహం
- ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ
- ముందస్తు సమాచారం లేకుండానే భద్రత తొలగించారని విమర్శ
- ప్రజల కోసమే పోరాటం చేస్తున్నానన్న ప్రవీణ్ కుమార్

2లో

## 'సర్'ను సీరియస్ గా తీసుకోండి

- మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్
- కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి
- రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా



## చంద్రబాబుకు గురుదక్షిణగా మన నీటి హక్కులు

- రాష్ట్రాన్ని ముంచుతున్న 'ముంపు మేస్త్రీ' సీఎం రేవంత్
- నదీజలాలపై అవగాహన లేని సీఎంతో తెలంగాణకు మరణ శాసనం
- ముగ్గురు సీఎంలు చేసుకున్న చీకటి ఒప్పందం బయట పెట్టాల్సిందే
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు



2లో

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

- బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా



పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే



2లో

## క్రిమినల్స్‌కు కులం అంటగట్టే సంస్కృతిని తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్

- యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన సాయికృష్ణను వెనకేసుకురావడంపై మండిపాటు
- బీసీలు ఐక్యంగా ఉండి, అడిగే స్థితి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపు
- సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలను నాశనం చేసిందని విమర్శ
- నిజమైన కార్యకర్తలను గుర్తించి, నాయకులుగా తీర్చిదిద్దేందుకే పార్టీ నిర్మాణ కమిటీలు

## సెషెల్స్ భద్రతకు భరోసా

- 'మేడ్ ఇన్ ఇండియా'నిఘా నౌకను అందజేసిన ప్రధాని మోదీ
- అంబులెన్స్‌లు, యుటిలిటీ వాహనాలు, లేజర్ రేడియల్ బోట్లు సైతం
- ప్రధానమంత్రికి సెషెల్స్‌లో ఘన స్వాగతం

విక్టోరియా: ద్వీప దేశమైన సెషెల్స్ సముద్ర భద్రతా సామర్థ్యాలను బలోపేతం చేయడానికి భారత్ సహకరిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఆయన శనివారం సెషెల్స్ దేశానికి చేరుకున్నారు. 'మేడ్ ఇన్ ఇండియా'నిఘా నౌకను సీషెల్స్ కోస్ట్‌గార్డుకు లాంఛనంగా అందజేశారు. రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో భారత్--సెషెల్స్ మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. భారత్‌లో తయారైన నిఘా నౌకను సెషెల్స్‌కు అందజేయడం ఇరుదేశాల మధ్య సంబంధాల్లోమరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోందని 'ఎక్స్'లో పోస్టుచేశారు.



2లో

# సెషెల్స్ భద్రతకు భరోసా

అలాగే ఆరు అంబులెన్స్‌లు, పది యుటిలిటీ వాహనాలు, ఐదు లేజర్ రేడియల్ బోట్లను కూడా సెషెల్స్‌కు అందజేశారు. అంతకుముందు భారత్ నుంచి సెషెల్స్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మోదీకి దేశాధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ ఘన స్వాగతం పలికారు. మోదీకి సైనికులు గౌరవ వందనం సమర్పించారు. కళాకారులు నాట్య ప్రదర్శనలతో మోదీని స్వాగతించారు. మోదీ కోసం సెషెల్స్‌లోని భారతీయులు తరలివచ్చారు. వారితో మోదీ కొద్దిసేపు ముచ్చటించారు. భారతదేశం పట్ల వారికున్న ప్రగాఢమైన అభిమానం, సెషెల్స్ పురోగతికి వారు అందిస్తున్న నిరంతర సహకారం నిజంగా ప్రశంసనీయమని పేర్కొన్నారు. భారతీయ ప్రవాసులు చాలాకాలంగా మన రెండు దేశాల మధ్య ఒక శక్తివంతమైన వారధిగా పనిచేస్తూ, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తూ, మన ఉమ్మడి ప్రయాణాన్ని సుసంపన్నం చేస్తున్నారని కొనియాడారు. ఈ పర్యటనలో భాగంగా ప్యాట్రిక్ హెర్మినీతో మోదీ సమావేశం కాబోతున్నారు. ద్వైపాక్షిక అంశాలపై వారిద్దరూ చర్చిస్తారు. సెషెల్స్ నేషనల్ డే స్వర్ణోత్సవాలకు గౌరవ అతిథిగా హాజరవుతారు. నేషనల్ అసెంబ్లీలో ప్రసంగిస్తారు. హిందూ మహాసముద్రంలో సెషెల్స్ ఒక విలువైన సముద్ర భాగస్వామి, సన్నిహిత మిత్రదేశమని మోదీ వివరించారు. రెండు దేశాల ప్రజలకు లబ్ధి చేకూరేలా సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి తాను ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

**కూర్మ రాజును సందర్శించిన మోదీ**

ప్రధాని మోదీ శనివారం అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో కలిసి సెషెల్స్ నేషనల్ బొటానికల్ గార్డెన్‌లోని భారీ తాబేళ్ల ఆవరణను సందర్శించారు. ఇక్కడ అల్డాబ్రా వృద్ధ తాబేలుకు ఆహారం తినిపించారు. సీషెల్స్‌కు చెందిన అల్డాబ్రా భారీ తాబేళ్లు భూమిపై అత్యంత పెద్దవి, అత్యధిక కాలం జీవించే జీవజాతుల్లో ఒకటి. వీటిలో కొన్ని తాబేళ్లు రెండు శతాబ్దాలకు పైగా చరిత్రకు సాక్షిగా నిలిచాయి. "అల్డాబ్రా తాబేళ్లకు భారత్, సీషెల్స్ మధ్యనున్న ప్రత్యేక స్నేహంతో అనుబంధం ఉంది. 2014లో రెండు తాబేళ్లను కోల్‌కతాలోని అలీపూర్ జంతు పదర్శన శాలకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత కొన్నేళ్లకు సెషెల్స్ మరికొన్ని తాబేళ్లను హైదరాబాద్ జూకు బహుమతిగా అందించింది"అని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల రెండు దేశాలకు ఉన్న ఉమ్మడి నిబద్ధతను చాటిచెబుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. సెషెల్స్‌కు మాత్రమే ప్రత్యేకమైన 'కోకో డి మెర్'అనే మొక్కను మోదీ నాటారు. కోకో డి మెర్‌కు సీషెల్స్‌లో విస్తృతమైన గౌరవం ఉందని, అది ఆ దేశ జాతీయ చిహ్నంపై కూడా ఉంటుందని మోదీ వివరించారు. అత్యంత పెద్ద విత్తనాలు, అత్యంత బరువైన పండ్లను ఉత్పత్తి చేయడంలో ఈ జాతి ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

# 'నాకు ఏం జరిగినా రేవంత్ రెడ్డిదే బాధ్యత'..

ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం తన సెక్యూరిటీని తొలగించిందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భవిష్యత్తులో తనకు ఏదైనా హాని జరిగితే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే పూర్తి బాధ్యత అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రవీణ్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. విపక్ష నేతగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఒక మాజీ ఉన్నతాధికారిగా, ప్రజానేతగా ఉన్న తనకు రక్షణ లేకుండా చేయడం వెనుక ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. తాను చేసే ప్రతి పోరాటం ప్రజల కోసమేనని, అందులో ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని ప్రవీణ్ కుమార్ చెప్పారు. భద్రత తొలగించినంత మాత్రాన తాను భయపడబోనని తెలిపారు. ప్రజల తరపున మరింత బలంగా గొంతెత్తుతానని స్పష్టం చేశారు.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.

# 'సర్'ను సీరియస్ గా తీసుకోండి: కేటీఆర్

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు.

మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# అమరావతిలో పేర్ని నాని తదితర వైసీపీ నేతలపై కోడిగుడ్లతో దాడి

వెళుతుండగా కూటమి సానుభూతిపరులు, రాజధాని రైతులు వారిని అడ్డుకున్నారు.'గో బ్యాక్ వైసీపీ' అంటూ నినాదాలు చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ నేతలపై కోడిగుడ్లు కూడా విసిరారు. లేళ్ల అప్పిరెడ్డి ప్రయాణిస్తున్న కారుపై రాళ్లు రువ్వడంతో వాహనం దెబ్బతిన్నట్లు సమాచారం. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు జోక్యం చేసుకున్నా ఉద్రిక్తత కొనసాగింది. పోలీసులపై కూడా రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. ఉండవల్లి ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# తిరుమలలో భారీ రద్దీ..సోమవారం శ్రీవాణి, వీఐపీ దర్శనాలు రద్దు

శ్రీవారి దర్శనార్థం తిరుమల కొండకు భక్తులు పోటెత్తడంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. అనూహ్యంగా పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని, సోమవారం జారీ చేయాల్సిన శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లతో పాటు, వీఐపీ సిఫార్సు లేఖలపై కేటాయించే దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం, జూన్ 27న టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి (ఏఈవో) వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి క్యూలైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూన్ నెలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని, ప్రతిరోజూ 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. శనివారం నాటికి దాదాపు 1.5 లక్షల మంది భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారని, ఆదివారం కూడా ఇదే స్థాయిలో రద్దీ కొనసాగే అవకాశం ఉందని అంచనా వేశారు. "భక్తుల రద్దీ దృష్ట్యా సోమవారం నాటి శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లను, వీఐపీ సిఫార్సు లేఖల ఆధారిత దర్శనాలను రద్దు చేశాం. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూనే, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం" అని వెంకయ్య చౌదరి వివరించారు. తిరుమల కొండపై రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, సామాన్య భక్తులకు దర్శన ప్రక్రియను సులభతరం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి.

# క్రిమినల్స్‌కు కులం అంటగట్టే సంస్కృతిని తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుల రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరస్థులకు, క్రిమినల్స్‌కు కులం రంగు పులిమి రాజకీయ ప్రయోజనం పొందాలని చూసే సంస్కృతిని తీవ్రంగా ఖండించారు. సాయికృష్ణ మిస్సింగ్ కేసును ప్రస్తావిస్తూ.. 14 ఏళ్ల అమ్మాయిని మూడు రోజుల పాటు గదిలో బంధించి హింసించిన ఓ కుర్రోడి అదృశ్యంపై కేసు నడుస్తోందని, ఓ క్రిమినల్‌కు కులం అంటగట్టి కొందరు ఎలా వెనకేసుకొస్తారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిందితుడి తల్లి బాధను నేను అర్థం చేసుకోగలను. అది వేరు. కానీ, ఒక ప్రొఫెషనల్ క్రిమినల్‌లా ప్రవర్తించిన వ్యక్తికి ఎలా మద్దతిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం తమ కులానికి చెందినవాడనే కారణంతో ఒక నేరస్థుడికి మద్దతు పలకడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ తరహా దిగజారుడు రాజకీయాలను జనసేన సహించబోదని స్పష్టం చేశారు. ఒక క్రిమినల్‌కు కులం ఎలా అంటగడతారు? ఏ ప్రాతిపదికన అతడిని వెనకేసుకొస్తారు? మీ కులం అయితే సరిపోతుందా? మీ నాయకుడు ఎవరో చెబితే, మీరేంటో నేను చెబుతాను. బూతులు తిట్టేవాళ్లను, క్రిమినల్స్‌ను నాయకులుగా నమ్మితే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్టు?" అని పవన్ ప్రశ్నించారు. వైసీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను వాడుకుంటోందని, తనను విమర్శించడానికి కాపు సామాజికవర్గానికి చెందిన నేతలనే ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. "నన్ను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపులే. వాళ్ల భుజాలపై తుపాకీ పెట్టి నన్ను కాలుస్తున్నారు. లింగమనేని రమేశ్ గారికి రాజ్యసభ ఇస్తే వాళ్లే విమర్శిస్తారు. ఈ కుట్రపూరిత రాజకీయాలను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కొందరికి అంత కోపం" అని పవన్ అన్నారు. తాను ఎప్పుడూ కులం కార్డు వాడి రాజకీయాలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని తేల్చిచెప్పారు. "దేశమే నాకు కులం. కులం అనేది ఒక సామాజిక వాస్తవం, దాన్ని గౌరవిస్తాను. కానీ అది ఇంటి గడప దాటకూడదు. గడప దాటితే మానవత్వం, దేశం మాత్రమే గుర్తుండాలి. నేను కులాల ఐక్యతను కోరుకుంటాను తప్ప, వాటిని రాజకీయ పెట్టుబడిగా మార్చను" అని ఆయన ఉద్ఘాటించారు. అధికారానికి దూరంగా ఉన్న సామాజిక వర్గాల సాధికారతపై పవన్ కల్యాణ్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల గురించి మాట్లాడుతూ, వారు ఐక్యతతో వ్యవహరించాలని సూచించారు. "దాదాపు 50 శాతం జనాభా ఉన్న బీసీలు ఎవరినో పదవులు అడగాల్సిన అవసరం ఏముంది? మీలో మీకు ఐక్యత లేదు కాబట్టే ఆ పరిస్థితి. గొడవలప్పుడు ఏకమవుతారు, ఓట్ల విషయానికి వచ్చేసరికి విడిపోయి సంప్రదాయ పార్టీలకు ఓటేస్తున్నారు. మీరు ఐక్యంగా ఉంటే, మీరు పది మందికి పదవులు ఇచ్చే స్థితిలో ఉంటారు కానీ, ఇలా దేహీ దేహీ అనే స్థితిలో ఉండరు. బీసీలంతా ఏకమైతే, మీకు వైసీపీ లాంటి పార్టీ అవసరం ఉండదు, నాలాంటోడు కూడా అవసరం ఉండదు" అని పవన్ అన్నారు.

# చంద్రబాబుకు గురుదక్షిణగా మన నీటి హక్కులు

హైదరాబాద్: తెలంగాణ నీటి హక్కు లను తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడికి గురుదక్షిణగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకుండా తెలంగాణ ప్రయోజనాలను బలి పెడుతూ 'ముంపు మేస్త్రీ'లా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా మూడు రాష్ట్రాల సీఎంల సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి, రాష్ట్ర భవిష్యత్‌ను కేంద్రం చేతుల్లో పెట్టే చీకటి ఒప్పందం జరిగిందన్నారు. కర్ణాటక ప్రభుత్వం 35 టీఎంసీల నవేలి రిజర్వాయర్‌తోపాటు 9.5 టీఎంసీల సామర్థ్యంతో మూడు బరాజ్‌లు, ఏపీ ప్రభుత్వం 20 టీఎంసీల గుండ్రేవుల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నా వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయకుండా సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాజెక్టుల వల్ల మొత్తం 55 టీఎంసీల నీరు నిల్వ అవుతుందని, శ్రీశైలానికి ప్రవాహం తగ్గి పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలతోపాటు ఆర్డీఎస్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

**రహస్య ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

ముఖ్యమంత్రుల సమావేశంలో మంత్రి ఉత్తమ్, రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులను బయటే ఉంచి కేవలం ముగ్గురు సీఎంలు, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి మాత్రమే పాల్గొనడం అనుమానాలకు తావిస్తోందని హరీశ్‌రావు అన్నారు. ఆ సమావేశంలో జరిగిన చర్చలు, కుదిరిన ఒప్పందాలను వెంటనే ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్‌కు ట్రిబ్యునల్ ప్రకారం రావాల్సిన 15.9 టీఎంసీల వాటా, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి అవసరమైన నీటి భద్రత, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు భవిష్యత్‌పై సమావేశంలో ఎలాంటి హామీ సాధించారో సీఎం వెల్లడించాలన్నారు. నదీ జలాలపై సరైన అవగాహన లేకపోవడంతోనే ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమవుతోందని విమర్శించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న చర్యల వల్ల చివరకు నష్టపోయేది తెలంగాణేనని, అయినా ప్రభుత్వం నిరసన వ్యక్తం చేయకపోవడం విచారకరమని చెప్పారు. గోదావరి నదిలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నికర జలహక్కులను పూర్తిగా సాధించకుండా నదుల అనుసంధానం పేరుతో ఏపీకి అనుకూలంగా వ్యవహరించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని హరీశ్‌రావు ఆరోపించారు.

# వెలిగొండ నిర్వాసితులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి..

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం భావోద్వేగభరిత వాతావరణంలో సాగింది. మార్కాపురం జిల్లా దోర్నాల పర్యటనలో భాగంగా ప్రాజెక్టు పనులను పరిశీలించిన అనంతరం సీఎం, యర్రగొండపాలెంలో నిర్వాసితులు, రైతులతో నేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ దశాబ్దాల కష్టాలను, గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న వేధింపులను ఏకరువు పెడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. "మా బాధలు పట్టించుకుని, పరిష్కారం చూపింది చంద్రబాబే" అంటూ సుంకేశుల గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీం వలీ అనే నిర్వాసితుడు సీఎం ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. తమకు పునరావాసం కల్పించేందుకు ఏకంగా ముఖ్యమంత్రే రూ.300 కోట్లతో రావడం తమ అదృష్టమని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తమకు జరిగిన అన్యాయాన్ని పలువురు రైతులు గుర్తు చేసుకున్నారు. పునరావాసం కల్పించాలని కోరినందుకు తమపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసి వేధించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కులను కాలరాసి, జైల్లో పెట్టారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పుడు పునరావాస ప్యాకేజీ కింద నిధులు విడుదల చేయడంతో తమ పిల్లల చదువులు, భవిష్యత్తుపై భరోసా కలిగిందని మరో నిర్వాసితుడు హనుమ ప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. తమ 30 ఏళ్ల కల నెరవేరుతోందంటూ కొందరు రైతులు సీఎంకు పాదాభివందనం చేసేందుకు ప్రయత్నించగా, చంద్రబాబు వారిని వారించి ఆపారు. నిర్వాసితుల ఆవేదనను సావధానంగా విన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, వారికి పూర్తి భరోసా కల్పించారు. "నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ఈ ప్రాజెక్టు కోసం మీరు చేసిన త్యాగం వెలకట్టలేనిది. మీ త్యాగానికి తగ్గ ఫలితాలు అందించే బాధ్యత నాది. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా, ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే గ్యారెంటీ నేను ఇస్తున్నా" అని ఆయన స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 7,225 మంది నిర్వాసితులు ఉండగా, గత ప్రభుత్వం కేవలం 96 మందికి మాత్రమే ఆర్ అండ్ ఆర్ నిధులు అందించిందని అధికారులు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం శనివారం నాడు 2,351 మంది నిర్వాసితులకు రూ.300 కోట్ల మేర ఆర్ అండ్ ఆర్ నిధులను అందించింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల రైతులు, నిర్వాసితులు పాల్గొన్నారు. సీఎం నేరుగా రైతుల మధ్యనే కూర్చొని వారితో మాట్లాడటం విశేషం.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## రేనికుంట పాల సొసైటీ చైర్మన్‌గా దశరథ

**- డైరెక్టర్లుగా రాజు, ప్రశాంత్ ఎన్నిక**

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రేనికుంట పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (మదర్ డెయిరీ) చైర్మన్‌గా పోసుకొండ దశరథ నాల్గవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి కొక్కొండ సిద్ధులు పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. సొసైటీ నూతన డైరెక్టర్లుగా మధ్రుగళ్ల రాజు, రంగ ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన చైర్మన్ దశరథ మాట్లాడుతూ.. పాడి రైతులకు మదర్ డెయిరీ ద్వారా సకాలంలో బిల్లులు అందుతున్నాయని, రైతులంతా డెయిరీకే పాలు పోసి మద్దతు ధర పొందాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని పలువురు నేతలు, పాడి రైతులు చేనేత శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## అపోహాలు వీడి ఓటరు సర్వేకు సహకరించాలి

**- కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెండు భాస్కర్ రెడ్డి**



**తొలివెలుగు, రాజాపేట:** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్వే) కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి అపోహాలు పడకుండా బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలు) సహకరించాలని కోమటిరెడ్డి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెండు భాస్కర్ రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని బసంతాపురం గ్రామంలో బీఎల్‌ఓలు ఓటర్లకు ఎన్యుమరేషన్, వెరిఫికేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామంలో ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను విజయవంతం చేసి బసంతాపురాన్ని మండలానికి ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓటరు ఫారాల పూరింపుపై స్థానికులకు ఉన్న పలు అనుమానాలను బీఎల్‌ఓలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాజాపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- మహిళా భవనం, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

**- ప్రారంభించిన సర్పంచ్ కోయ మధు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో స్థానిక వెలుగు కార్యాలయం పక్కన నిర్మించనున్న స్వయం సహాయక సంఘాల సమైక్య (మహిళా) భవనానికి, అలాగే నేమిల చౌరస్తాలోని కొండ మార్కండేయుల నివాసం నుంచి కందకం వరకు చేపట్టనున్న అంతర్గత మురికి కాలువ (అండర్ డ్రైనేజీ) నిర్మాణ పనులను సర్పంచ్ కోయ మధు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన ఈ పనులను గడువులోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# మృత్యుపాశాలుగా రహదారి ఆక్రమణలు!

**▫ ఇద్దరి ప్రాణాలు బలిగొన్నా మారని వ్యవస్థ**

**జరామన్నపేట - నీర్నేముల మార్గంలో బండరాళ్లతో ఆక్రమణలు**

**▫ ఫిర్యాదులు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**

ట**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రం నుంచి నీర్నేముల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఆక్రమణలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. బాధ్యతారాహిత్యంగా కొందరు రహదారిని ఆక్రమిస్తున్నా.. పర్యవేక్షించాల్సిన రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ), పంచాయతీరాజ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ముఖ్యమైన మార్గంలో, బొత్తలబావి సమీపంలో మెయిన్ రోడ్డును ఆనుకుని భారీ బండరాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో రహదారి పూర్తిగా ఇరుకుగా మారి అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

**ఇద్దరిని బలి తీసుకున్నా.. వీడని నిర్లక్ష్యం!**

గతంలో ఇదే బొత్తలబావి సమీపంలోని మలుపు వద్ద ఆక్రమణలు, రోడ్డుపైకి వచ్చిన అవరోధాల కారణంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనల తర్వాతైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని స్థానికులు భావించారు. కానీ, పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. కళ్లెదుటే మరణాలు సంభవించినా మళ్లీ అదే ప్రాంతంలో ఏకంగా భారీ బండరాళ్లను తెచ్చి వేయడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పత్రికల్లో వరుసగా కథనాలు వస్తున్నా అధికారుల్లో కదలిక లేకపోవడం గమనార్హం.

**భయం భయంగా పాఠశాల బస్సుల ప్రయాణం:**

ప్రస్తుతం ఆక్రమణల కారణంగా రహదారి ఎంతగా ఇరుకుగా మారిందంటే.. ఒక ఆర్టీసీ బస్సు లేదా భారీ వాహనం ఎదురుగా వస్తే, పక్క నుంచి ద్విచక్ర వాహనం కూడా వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది విద్యార్థులతో కూడిన స్కూల్ బస్సులు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. ఏ చిన్న తేడా జరిగినా భారీ ప్రమాదం జరిగే ముప్పు ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**తక్షణమే చర్యలు చేపట్టాలి:**

ఈ తీవ్రమైన సమస్యపై స్థానిక గ్రామస్థులు, వాహనదారులు పలుమార్లు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని, రహదారిపై ఉన్న ఆక్రమణలు, బండరాళ్లను తొలగించి ప్రయాణికులకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించిన మేడిరాజు**

**తొలివెలుగు, రామన్నపేట:** ప్రజాస్వామ్య వ్యవస్థలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండటం ప్రాథమిక బాధ్యతని బీఆర్ఎస్ యువజన నాయకుడు మేడిరాజు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఉట్కూరు గ్రామంలో ఆయన అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేడిరాజు మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది రాజ్యాంగం పౌరులకు కల్పించిన అత్యంత శక్తిమంతమైన ఆయుధమన్నారు. దేశ భవిష్యత్తును మార్చే, సరైన నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, ఇప్పటివరకు జాబితాలో పేర్లు లేని వారు తక్షణమే ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్, గ్రామస్థులు పాల్గొన్నారు.





## కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి డిమాండ్**

తొలివెలుగు, వలిగొండ: సకాలంలో వర్షాలు కురవక పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో 'దళితవాడల సర్వే సమస్యలపై పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి దొరకడం లేదన్నారు. పులిగిల్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. గ్రామ ఉపాధి పనులతో పాటు పులిగిల్ల ఎస్సీ కాలనీలో సగం లోనే నిలిచిపోయిన అంతర్గత మురుగు కాలువ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. దళితులకు 55 ఏళ్లకే వృద్ధాప్య పింఛను అందించాలని, కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం తక్షణమే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డి బిక్షపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వేముల అమరేందర్, నాయకులు దొడ్డి యాదగిరి, లక్ష్మణ్, శివమణి, లక్ష్మమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**- మొదటి దశ పూర్తయితేనే తదుపరి జాబితా**

**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి, ఇళ్ల నిర్మాణాల పురోగతితో పాటు వర్షాకాలం నేపథ్యంలో అంతర్గత మురికి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మొదటి దశ (ఫేజ్-1) లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన తర్వాతే అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి రెండో దశ (ఫేజ్-2) జాబితాకు ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పనులు పెండింగ్‌లో ఉంచితే తదుపరి ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. సర్పంచులు తమ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించి, లబ్ధిదారులు సకాలంలో ఇళ్లు పూర్తి చేసుకునేలా చొరవ చూపాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.జలందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ కిరణ్, సర్పంచులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కొత్త పట్టాదారులకూ రైతు భరోసా

**- ఈ నెల 15 లోపు పాసుపుస్తకాలు పొందిన వారు అర్హులు**

**- మండల వ్యవసాయ అధికారిణి పద్మజ వెల్లడి**

**తొలివెలుగు, రాజాపేట:** కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తిస్తుందని రాజాపేట మండల వ్యవసాయ అధికారిణి (ఏఓ) పద్మజ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ లోపు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ నెల 30న వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు విడుదల కానున్న నేపథ్యంలో, కొత్త పట్టాదారులు తక్షణమే తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు తమ పరిధిలోని క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# రాజాపేటకు బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

**- యాదగిరిగుట్ట డీఎంకు సర్పంచి కోయ మధు వినతి**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రానికి గతంలో నడిచిన బస్సు సర్వీసులను తక్షణమే పునరుద్ధరించి రవాణా సౌకర్యం కల్పించాలని సర్పంచి కోయ మధు కోరారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. మండలంలో రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా, గతంలో నడిపిన రెండు షటిల్ బస్సుల్లో ప్రస్తుతం ఒక్కదానినే కొనసాగించడం సరికాదన్నారు. దీనివల్ల వేలాది మంది ప్రయాణికులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నడిచిన నర్సాపూర్ నైట్ హాల్ట్, జగద్గిరిగుట్ట, బేగంపేట, అమ్మనబోలు సర్వీసులను కూడా పునరుద్ధరించాలని కోరారు. ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తున్న రాజాపేట సెక్టార్‌పై అలసత్వం వహించవద్దని, బస్సుల రద్దుతో ప్రయాణికులతో పాటు రైతులు, మహిళలు నష్టపోతున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీతో పాటు వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఓటరు ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**- అర్హులంతా ఓటు హక్కును పరిరక్షించుకోవాలి**



**తొలివెలుగు, వలిగొండ:** ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం వలిగొండలోని తన నివాసంలో ఓటరు వివరాల ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), ఎన్నికల సిబ్బంది ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఆయనతో పాటు కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను పరిశీలించి నమోదు చేశారు. ఈ ప్రక్రియకు ఎమ్మెల్యే పూర్తిగా సహకరించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వగ్రామంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి పర్యటన

**- ప్రజలను అడిగి సమస్యల గుర్తింపు**

**- మిత్రుడి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం**



**తొలివెలుగు, వలిగొండ:** భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం తన స్వగ్రామమైన వలిగొండలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని పలు కాలనీలు, వీధుల్లో తిరుగుతూ స్థానికులను కలిసి తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే.. తన చిన్ననాటి మిత్రుడు రామచంద్రు ముదిరాజ్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలుసుకుని తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి వ్యక్తిగత నిధుల నుంచి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత ఊరి ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం తన బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# బడి నడిచినా.. హాజరు సున్నా!

**- 35 మంది హెచ్‌ఎంలపై డీఈఓ బిక్షపతి ఆగ్రహం.. షోకాజ్ నోటీసులు జారీ**

**- యాప్‌లో నమోదు చేయని 10 పాఠశాలల్లో జీరో పర్సంటేజ్**

**- నిర్లక్ష్యం వీడకుంటే కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరిక**

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమై పది రోజులు దాటినా కొందరు ప్రధానోపాధ్యాయుల్లో ఇంకా బద్ధకం వదలడం లేదు. విద్యార్థుల హాజరును ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్న 35 మంది హెడ్‌మాస్టర్లకు జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి గట్టి షాక్ ఇచ్చారు. ఈ నెల 24న విద్యార్థుల ముఖహాజరు (ఫేషియల్ అటెండెన్స్) నమోదులో విఫలమైనందుకు వారందరికీ ఒకేసారి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

**అధికారుల పర్యవేక్షణతో బయటపడ్డ నిర్లక్ష్యం:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని కొందరు ఉపాధ్యాయులు తూతూమంత్రంగా అమలు చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. జిల్లాలోని 10 పాఠశాలల్లో అటెండెన్స్ శాతం ఏకంగా 'జీరో'గా నమోదైంది. బడికి పిల్లలు వస్తున్నా యాప్‌లో నమోదు చేయకపోవడం లేదా ఉపాధ్యాయులే దీనిపై శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ఈ దారుణం జరిగింది. మరో 25 పాఠశాలల్లో కనీసం 35 శాతం కూడా హాజరు నమోదు కాలేదు. దీనిపై డీఈఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**లిస్ట్‌లో చౌటుప్పల్ బడులు:**

షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో చౌటుప్పల్ మండలానికి చెందిన ఐదు పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు. లింగోజీగూడెం, రెడ్డిబావి ప్రాథమిక పాఠశాలలు 'జీరో' హాజరుతో అభాసుపాలు కాగా.. బంగారిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాల, బీసీ కాలనీ, పంతంగి ప్రాథమిక పాఠశాలలు 35 శాతం లోపు హాజరుతో నోటీసుల జాబితాలోకి ఎక్కాయి.

**ఉపాధ్యాయుల్లో గుబులు: 30 లోగా గడువు**

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, విద్యాశాఖ ఆదేశాలను బేఖాతరు చేస్తున్న హెచ్‌ఎంలు మూడు రోజుల్లోగా తమ వివరణ ఇవ్వాలని డీఈఓ స్పష్టం చేశారు. ఆయా మండలాల ఎంఆర్‌సీల (మండల రిసోర్స్ సెంటర్) ద్వారా ఈ నెల 30వ తేదీ లోపు డీఈఓకు లిఖితపూర్వక



సమాధానం అందజేయాల్సి ఉంటుంది. సరైన కారణం లేకుండా నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులపై సస్పెన్షన్ లేదా నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని విద్యాశాఖ వర్గాలు హెచ్చరించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో గుబులు మొదలైంది.

# తక్కువ ధరకే స్వచ్ఛమైన బంగారమంటూ.. చీటింగ్

**గోల్డ్ మ్యాన్ సూర్యకు 14 రోజుల రిమాండ్**

హిమాయత్‌నగర్: తక్కువ ధరకే స్వచ్ఛమైన బంగారమంటూ.. మోసం చేసిన గోల్డ్ మ్యాన్‌గా పేరొందిన సూర్యాబాయ్‌ను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జిల్లా కమల ఈస్ట్‌నగర్‌లో ఉంటున్న వేగ్రోజ్ కృష్ణాచారి నవీన్ సింగ్ అనే వ్యక్తితో కలిసి హిమాయత్‌నగర్‌లోని ఎన్ఎస్ జ్యువెల్లరీ దుకాణం నడుపుతున్నాడు. భీమేశ్వరచారి అనే వ్యక్తి సూచన మేరకు సూర్యాబాయ్ అలియాస్ గోల్డ్ మ్యాన్(34)ను కృష్ణాచారి కలిశారు. అతడు 1 కిలో బంగారం అందుబాటులో ఉందని, దానికి రూ.1కోటి 50 లక్షల ధర నిర్ణయించినట్లు చెప్పి.. కొంత డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశాడు. సూర్యాబాయ్ రూ. 27 లక్షల నగదుతో పాటు రూ.5లక్షల 30వేల విలువైన బంగారు ఆభరణాలను తీసుకున్న తరువాత ..కిలో బంగారాన్ని ఇవ్వకుండా మోసం చేశాడు. నారాయణగూడ పోలీసులు సూర్యాబాయ్‌ని అరెస్టు చేశారు. న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.



# అంబుజా సిమెంట్ వ్యతిరేక పోరాట విజయోత్సవ సభ



**ప్రజాశక్తి ముందు లొంగిన కంపెనీ యాజమాన్యం**

**- పర్యావరణ పరిరక్షణ వేదిక ప్రతినిధుల వెల్లడి**

**తొలివెలుగు, రామన్నపేట:** పరిధిలో ప్రతిపాదిత అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకుంటున్నట్లు కంపెనీ వర్గాలు ప్రకటించడం స్థానిక ప్రజల పోరాట విజయమని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో–కన్వీనర్ మహమ్మద్ రెహన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లా (ఐబీ) ఆవరణలో వేదిక ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా మండల వ్యాప్తంగా ప్రజలు, అఖిలపక్షాలు, వివిధ వృత్తి సంఘాలు, యువజన, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఉద్యమించి కంపెనీని తిప్పికొట్టాయని గుర్తుచేశారు.

**రహదారి బంగ్లాలో సభ:**

ఈ సుదీర్ఘ ఉద్యమ స్ఫూర్తిని మననం చేసుకోవడానికి, పోరాటంలో భాగస్వాములైన సబ్బండ వర్గాలను అభినందించడానికి ఈ నెల 29న మండల కేంద్రంలోని రహదారి బంగ్లా ఆవరణలో భారీ విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు వివిధ పార్టీల ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక సభ్యులు ఊట్కూరు నరసింహ, ఎండీ జమీరుద్దీన్, కందుల హనుమంతు, ఫజల్ బేగ్, నోముల చిరంజీవి, రాజు, బత్తుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# రామన్నపేట పాల సంఘం చైర్మన్‌గా గొరిగే శేఖర్

**- వరుసగా మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక**

తొలివెలుగు, రామన్నపేట: పట్టణ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం (పాల సంఘం) చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొరిగే శేఖర్ వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన సంఘం ఎన్నికల అనంతరం ఆయన ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. శేఖర్ మూడోసారి చైర్మన్‌గా బాధ్యతలు దక్కించుకోవడంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు చైర్మన్ శేఖర్‌ను చేనేత శాలువాలతో ఘనంగా సన్మానించి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరుద్దీన్, రామన్నపేట ఉప సర్పంచ్ మోటి రమేష్, వనం చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సాల్వేర్ అశోక్, పార్టీ మండల నాయకులు అక్రమ్, బొడ్డు సాలయ్య, నాసర్, గోదాసు శివనారాయణ, కొమ్ము నాగరాజు, గొలుసుల ప్రసాద్, వార్డు సభ్యులు అంజద్, కరీం, అజార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# జూలూరులో గడ్డివాము దగ్ధం

**- కౌలు రైతుకు భారీ నష్టం - మహేష్ అనే వ్యక్తిపై అనుమానంతో కేసు నమోదు**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని జూలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామును తగలబెట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. జూలూరుకు చెందిన దుర్గం మల్లేష్ గత పదేళ్లుగా అదే గ్రామానికి చెందిన బొమ్మిడి సుధాకర్ రెడ్డి వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మల్లేష్‌కు పాడి పరిశ్రమ ఉండటంతో పశుగ్రాసం కోసం రూ. వేల విలువైన 900 వరి గడ్డి కట్టలను కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో ఈ గడ్డివాము ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. దీనిపై బాధితుడు మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమీప భూమి కౌలుదారుడైన కొత్తపల్లి మహేష్‌పై తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## చిరు వ్యాపారాలపై మళ్లీ బుల్డోజర్లు

మణికొండ, జూన్ 27: పాదచారులకు సురక్షితమైన ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ విభాగం, పోలీసు శాఖ సమన్వయంతో చేపట్టిన కార్యక్రమంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన ఆహార స్టాళ్లు, వీధి వ్యాపారాలు, తాత్కాలిక నిర్మాణాలు తదితర అనధికార ఆక్రమణలను తొలగించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నార్సింగి సర్కిల్ గండిపేట ఎక్స్ రోడ్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. అలాగే పటాన్‌చెరువు, అమీన్‌పూర్, మియాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లల్లోనూ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ జోన్‌లో మొత్తం 5 రహదారి విభాగాల్లో 10.8 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేసి 197 ఆక్రమణలను తొలగించారు. అలాగే కూకట్‌పల్లి జోన్‌లోని మూడు రహదారి విభాగాల్లో 3.16 కి.మీ మేర 105 ఆక్రమణలు, కుత్బుల్లాపూర్ జోన్‌లో ఏడు రహదారి విభాగాల్లో 15.53 కి.మీ మేర 204 ఆక్రమణలను తొలగించారు. మొత్తం 30.29 కిలోమీటర్ల ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేశారు.

## అడిగినంత ఇస్తే తప్ప పని కాదట.. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం అంటూ ఏసీబీ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. ఏదైనా పనిచేయాలంటే టేబుల్ కింద చేయి పట్టనిదే చేయమంటున్నారు. ప్రజల నిత్యం ఎవరో ఒక అధికారి అవినీతికి పాల్పడుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్నాడు. తాజాగా ఓ గ్రామపంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంఘటన మండలాల్లో శనివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బాణాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా తమ్మిశెట్టి సురేష్ విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోగా లంచం డిమాండ్ చేశాడు. అడిగినంత ఇవ్వలేనని కొంతవరకు ఇస్తానని వేడుకున్నాడు. అడిగినంత ఇస్తే తప్ప పని కాదని రెండు మూడు నెలల నుంచి తిప్పుతున్నాడు. విసిగి వేసారిన బాధితుడు ఏసీబీని సంప్రదించాడు. వారు పక్కా ప్రణాళికతో శనివారం బాధితుడి నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటుండగా సురేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు వ్యతిరేకంగా లంచాలు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కి కాల్ చేయాలని లేదా 9440446106 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ ఉన్నతాధికారి కోరారు

## డంపింగ్ యార్డు వద్దే.. వద్దు

ఆదిబట్ల, జూన్ 27 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల గ్రామంలో ప్రతిపాది త ఎకోటౌన్ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్య తిరేకిస్తూ ఈ నెల 29న చేపట్టనున్న రంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడికి బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలంగాణభవన్‌లో అధికారికంగా ప్రకటించారు. బండరావిరాల సర్పంచ్ విజయ్‌కుమార్‌తోపాటు పార్టీ నాయకులు, గ్రామస్తులు తెలంగాణభవన్‌లో ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ముట్టడికి మద్దతు కోరగా..బీఆర్ఎస్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చా రు. సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో క్రషర్లకు వ్యతిరేకంగా సుమా రు 400 రోజులపాటు పోరాడి విజయం సాధించిన బండరావిరాలవాసులు ఇప్పుడు డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా మరో ఉద్యమానికి సిద్ధమయ్యారన్నారు. జవహర్‌నగర్ తరహాలో హైదరాబాద్ నగరంలోని చెత్తను బండరావిరాలకు తరలించే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. బండరావిరాలతోపాటు చిన్నరావిరాల, పిల్లాయిపల్లి, పెద్దగూడెం, జగత్‌పల్లి, దేశ్‌ముఖి, కవాడిపల్లి, బాచారం సహా దాదాపు 15 గ్రామాల ప్రజలు తీవ్ర కాలుష్య ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా విరమించుకునే వరకు ప్రజలతో కలిసి ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కాగా, కలెక్టరే ట్ ముట్టడికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ అబ్దుల్లాపూర్‌మెట్ మండలాధ్యక్షుడు కిషన్‌గౌడ్, బండరావిరాల సర్పంచ్ విజయకుమార్, సీనియర్ నాయకులు దానేశ్, దయాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు అనూష, భరత్‌యాదవ్, యువనాయకులు శివశంకర్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరి గోవిందుడికి వసంతోత్సవ శోభ!





- శ్రీవారి నిత్య కల్యాణానికి పోటెత్తిన భక్తజనం
- అంగరంగ వైభవంగా శ్రీవారి నిత్య కల్యాణం
- సహస్ర దీప కాంతుల్లో దర్శనమిచ్చిన మలయప్ప స్వామి
- 5 వేల మందికి పైగా అన్నప్రసాద వితరణ

**తొలివెలుగు, భువనగిరి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, నిజజ్యేష్ఠ మాసం శుక్ల పక్ష త్రయోదశి (శనివారం) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో శ్రీవారికి విశేష పూజలు, వసంతోత్సవం, నిత్య కల్యాణోత్సవాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

**పాతఃకాల సేవలు ఇలా..**

వేకువజామునే ప్రాతఃకాలంలో శ్రీవారికి సుప్రభాత సేవను కమనీయంగా నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ట దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. ఉదయం 5:45 గంటలకు నిత్యారాధనలో భాగంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ సువర్ణ బిందె తీర్థాన్ని బంగారు బావి నుంచి తీసుకొచ్చారు. 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వామివారికి మేళతాళాలు, మృదంగ, మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరిత పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా జరిపించారు. 7 గంటలకు మణిమయ శోభిత స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయినామాలతో సహస్ర నామార్చన సేవను, లోక కల్యాణార్థం శ్రీ సుదర్శన నారసింహ హవనాన్ని ఘనంగా నిర్వహించారు.




**కన్నుల పండువగా నిత్యకల్యాణం, వసంతోత్సవం:**

ఆలయ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వసంతోత్సవం నేత్రపర్వంగా సాగింది. పంచామృతాలు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ అభిషేకాలు నిర్వహించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఉదయం 10:30 గంటలకు పట్టు పీతాంబరాలు ధరించిన శ్రీవారికి వైభవోత్సవ మండపంలో నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. విచ్చేసిన భక్తులు కల్యాణాన్ని వీక్షించి ఆనంద పారవశ్యానికి లోనయ్యారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సుమారు 5 వేల మందికి పైగా భక్తులు స్వామివారి నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

**మాడవీధుల్లో శ్రీవారి ఉత్సవం:**

సాయంత్రం 6:30 గంటలకు ఆదిమధ్యాంతరహితుడైన స్వామివారిని ఆలయ మాడవీధుల్లో శోభాయమానంగా ఊరేగించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య స్వామివారు ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి కూడా అర్చకులు ప్రత్యేక మంగళహారతులు సమర్పించారు.



# పదోన్నతులు ఇచ్చి.. పోస్టింగ్‌లు మరిచి

ఆబ్కారీ శాఖలో పదోన్నతులు వచ్చినా పోస్టింగ్‌లేని విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. సుదీర్ఘ కాలం తరువాత ఆ శాఖలోని కానిస్టేబుళ్లు, సీఐలు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లకు పదోన్నతులు వచ్చాయి. కానీ ఆయా స్థాయి పోస్టింగ్‌లు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం విఫలమవుతోందని ఆబ్కారీ వర్గాలు వాపోతున్నాయి. పదోన్నతులు వచ్చిన దాదాపు ఏడు నెలల తరువాత మూడు రోజుల కిందట ఈఎస్, డీసీ, ఏసీ స్థాయి అధికారులకు పోస్టింగ్‌లు కల్పించారు. ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులకు నెలలు గడిచినా పోస్టింగ్‌లు దక్కలేదు. క్యూర్ పరిధిలో దాదాపు 13 కొత్త ఆబ్కారీ స్టేషన్‌లను ఏర్పాటు చేసినా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు లేక కొత్త స్టేషన్‌ల బాధ్యతలను కూడా పాత స్టేషన్ అధికారులకే అప్పగించారు. దీంతో కొత్త స్టేషన్ల ఏర్పాటుకు అర్థం లేకుండా పోయింది. ఆబ్కారీ శాఖలో కానిస్టేబుల్ నుంచి డీసీ వరకు మొత్తం 137 మందికి పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే. వారిలో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుళ్లుగా 31మందికి, ఎస్ఐ నుంచి సీఐలుగా 69 మందికి, సీఐ నుంచి ఏఈఎస్‌లుగా 14 మందికి, ఏఈఎస్ నుంచి ఈఎస్‌గా 14 మందికి, ఏసీ నుంచి డీసీలుగా 9 మంది అధికారులకు పదోన్నతులు లభించాయి. వీరిలో సుదీర్ఘ కాలయాపన తరువాత ఇటీవలే ఏఈఎస్ పైస్థాయి అధికారులకు పోస్టింగ్‌లు కల్పించారు. పదోన్నతులు లభించి 7 నెలలు గడుస్తున్నా పోస్టింగ్‌లు కల్పించకపోవడంతో హోదా పెరిగినప్పటికీ కింది స్థాయిలోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోందంటూ ఏఈఎస్‌లు, సీఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోస్టింగ్‌లు ఇవ్వడం ఆలస్యమైనాకొద్దీ వాటికి డిమాండ్ పెరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫోకల్ ఏరియాలో పోస్టింగ్ కోసం అప్పుడే పైరవీలు మొదలైనట్లు వినికిడి. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పోస్టింగ్ కోసం చాలా మంది పోటీ పడుతున్నట్లు సమాచారం. రాష్ట్రం మొత్తంలో రంగారెడ్డి జిల్లాకు అత్యధిక ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈఎస్, డీసీ, ఏసీ స్థాయి అధికారుల పోస్టింగ్‌లు పూర్తవడంతో ఇప్పుడు ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ స్థాయి అధికారులు ఫోకల్ పోస్టింగ్‌ల కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో చాలా మంది హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఈఎస్ స్థాయి పోస్టు వరకు ఉమ్మడి తరంగారెడ్డి జిల్లానే కోరుకుంటున్నట్లు ఆబ్కారీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక హైదరాబాద్ విషయానికి వస్తే ధూల్‌పేట మినహా ఇతర ప్రాంతాలకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఫోకల్ ఏరియాల్లో పోస్టింగ్‌ల కోసం సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. నచ్చిన పోస్టింగ్‌ల కోసం కొందరు ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా మరికొందరు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నట్లు ఆబ్కారీ భవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి

## షేరు ధర 60 పైసలు మాత్రమే.. బోనస్ షేర్ల ప్రకటనతో 5 శాతం జంప్..



ఫార్మా సెక్టార్‌లోని స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ బయోజెన్ ఫార్మాకెమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఇటీవలే సమావేశమై 1:6 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు బోర్డ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీంతో ప్రతి ఆరు షేర్లకు ఒక షేరు ఉచితంగా లభిస్తుంది. అంతే కాదు రికార్డు డేట్ మే 15 గా నిర్ణయించారు. ఈ షేరు ధర కేవలం 60 పైసలుగా ఉండడం గమనార్హం. మరి ఆ వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. స్మాల్ క్యాప్ కేటగిరిలోని ఫార్మా సెక్టార్ కంపెనీ బయోజెన్ ఫార్మాకెమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (దీఅశీస్త్రవఅ ౄష్ణుతీమిఖుఎష్ట్రవఎ ×అఎబరీతీఅవం ాఱఎఱ్‌వఎ) సూపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇటీవలే సమావేశమై 1:6 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ బోనస్ షేర్లు జారీ రికార్డు డేట్ మే 15 గా నిర్ణయించారు. ఈ బోనస్ ఇష్యూ ప్రకారం ప్రతి 6 షేర్లకు 1 షేర్ ఉచితంగా పొందుతారు. మరోవైపు ఈ కంపెనీ షేర్ ఇవాళ్టి ట్రేడింగ్ సెషన్లో 5 శాతానికిపైగా లాభల్లోకి దూసుకెళ్లింది. బయోజెన్ ఫార్మా చెమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు రూ. 1లోపు ధర కలిగిన పెన్నీ స్టాక్. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇటీవలి సమావేశంలో 1:6 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేయడానికి ఆమోదం తెలుపారు. దీని అర్థం రికార్డు తేదీ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండే 6 ఈక్విటీ షేర్లను కొనుగోలు చేసి తమ డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉంటారో అలాంటి వారికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉంటే మరో 1 ఈక్విటీ షేరు ఉచితంగా బోనస్ రూపంలో జారీ చేస్తారు. అలాగే ఈ బోనస్ షేర్లు అందుకునేందుకు అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ మే 15గా బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ వెల్లడించింది.

## ఖాతాలో మొత్తం డబ్బును విత్‌డ్రా చేయాలా?




అయితే ముందు దీన్ని ఆన్‌లైన్‌లో చేయాలి.. మీరు ఉద్యోగి అయి ఉంది. పలు ఆర్థిక కారణాలతో మీ ౄఖీ ఖాతాలోని డబ్బులను విత్‌డ్రా చేయాలనుకుంటున్నారా? అయితే ముందు ఈ పని చేయాల్సిందే అంటున్నారు అధికారులు. ఈపీఎఫ్ఓ కొత్త పీఎఫ్ నిబంధనలు 2025, పీఎఫ్ విత్‌డ్రాల్ అర్హత, పీఎఫ్ 100 శాతం విత్‌డ్రా, కారణం లేకుండా పీఎఫ్ తీసుకునే నియమాలు, ఈపీఎఫ్ఓ పెన్షన్ స్కీమ్, పీఎఫ్ లోన్ వర్సెస్ విత్‌డ్రా నియమాలు ఈ రోజుల్లో ఉద్యోగాలు మారడం సర్వసాధారణమైపోయింది. కానీ మీరు మీ పాత కంపెనీని విడిచిపెట్టి కొత్త కంపెనీలో చేరినప్పుడు, మీ ఖ్రఖీ ఖాతాలో పాత కంపెనీ నుండి నిష్క్రమించిన తేదీ (ఖూజు)ని అప్‌డేట్ చేయకపోతే ఒక పెద్ద సమస్య తలెత్తవచ్చు. మీరు ౄఖీ పూర్తి మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలన్నా, పెన్షన్ క్లెయిమ్ చేసుకోవాలన్నా లేదా పాత బ్యాలెన్స్‌ను కొత్త ఖాతాకు బదిలీ చేసుకోవాలన్నా నిష్క్రమణ తేదీని అప్‌డేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం ఏప్రిల్ నుంచే.. పీఎఫ్ అకౌంట్ ఉన్న వారికి భారీ గుడ్ న్యూస్.. మంచి విషయం ఏమిటంటే, ఇప్పుడు మీరు మీ పాత కంపెనీ హెచ్ఆర్ లేదా ఈపీఎఫ్ఓ కార్యాలయంతో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మీరు మీ మొబైల్ లేదా కంప్యూటర్ నుండి ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ మెంబర్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో 'మార్క్ ఎగ్జిటింగ్' చేయడం ద్వారా మీ డీఓఈని అప్‌డేట్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ సులభమైనది, వేగవంతమైనది. ఆధార్ ఆధారిత ఓటీపీతో ఈ పని అయిపోయింది అప్‌డేట్ చేయడం ఎందుకు అవసరం? (1) ఖూజుని అప్‌డేట్ చేయకుండా, పూర్తి మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోలేరు. (2) ఇది కాకుండా, ఫారం 10జ నింపడం ద్వారా మీ పెన్షన్ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి, ఉద్యోగం విడిచిపెట్టిన తేదీ (నిష్క్రమణ తేదీ) నమోదు చేయాలి

## ఏడాదికి ఒక్కసారే రీఛార్జ్.. కొత్త ప్లాన్.. రోజుకు డేటా, అపరిమిత కాల్స్




ఒక్క క్షణం కనిపించకపోయినా ఏదో కోల్పోయినట్లు అవుతుంది. సిమ్ పని చేసేందుకు వాలిడ్ రీఛార్జ్ ప్లాన్ ఉండాలి. వాలిడ్ ప్లాన్ లేకుంటే కాల్స్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయి. నెల, మూడు నెలలు, ఆరు నెలల చొప్పున రీఛార్జ్ చేసేటప్పుడు కొంత చికాకు ఉంటుందని చెప్పవచ్చు. అలా మీరు కూడా ఫీలయితే ఏడాది మొత్తానికి ఒకేసారి రీఛార్జ్ చేసుకోవడం మంచిది. బీఎస్ఎన్ఎల్ 365 డేస్ ప్లాన్ తక్కువ ధరకే అందిస్తోంది. రోజుకు 3 జీబీ డేటా, అపరిమిత కాల్స్ వస్తాయి. మరి ఆ వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. రోజువారీ మానవ జీవితంలో మొబైల్ ఫోన్ ఒక ముఖ్యమైన వస్తువుగా చెప్పవచ్చు. ఒక్క క్షణం ఫోన్ కనిపించకపోతే ఇబ్బంది పడేవారి సంఖ్య పెరుగుతోంది. కాల్స్ చేసుకోవడమే కాదు ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలకు ఇప్పుడు మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. డబ్బులు పంపించేందుకు, పేమెంట్లు చేసేందుకు, షాపింగ్ చేసేందుకు మొత్తం మొబైల్ వినియోగిస్తున్నాయి. అయితే, ఇలా ప్రతిదానికి మొబైల్ ఉపయోగించాలంటే వాలిడ్ రీఛార్జ్ ప్లాన్ యాక్టివేట్‌లో ఉండాలి. గడువు తీరిపోతే కాల్స్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఓటీపీలు రావు, యూపీఐ వంటి చెల్లింపులు చేయలేము. అయితే, చాలా మంది నెల రోజులకు, మూడు నెలలకు మాత్రమే రీఛార్జ్ చేస్తుంటారు. అలా చేస్తే గడువు దగ్గర పడుతున్న కొద్ది ఆందోళన మొదలవుతుంది. నెట్‌వర్క్ కట్ అవుతుందనే ఆందోళనతో అప్పు చేసైనా రీఛార్జ్ చేయాల్సి వస్తుంది. అయితే అలాంటి టెన్షన్ లేకుండా 365 రోజుల ప్లాన్ రీఛార్జ్ చేసుకోవడం మంచిదని విశ్లేషకులు సూచిస్తుంటారు. నెల, మూడు, ఆరు నెలలు అంటూ రీఛార్జ్ చేసేందుకు చికాకు పడే వారు ఈ ఏడాది ప్లాన్ ఎంచుకోవడం మంది. ఏడాదిలో ఒక్కసారి రీఛార్జ్ చేస్తే నిశ్చింతగా ఉండొచ్చు. లాంగ్ టర్మ్ ప్లాన్స్ ధరలు సైతం తక్కువగానే ఉంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వ టెలికాం దిగ్గజ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (దీూచీూ) మరో లాంగ్ టర్మ్ ప్లాన్ తీసుకొచ్చింది. ఏడాది రీఛార్జ్ ప్లాన్ తక్కువ ధరకే అందిస్తోంది. 365 రోజుల పాటు అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు అధిక డేటాను అందిస్తున్నట్లు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా బీఎస్ఎన్ఎల్ ఇండియా ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. మరి ఆ లాంగ్ టర్మ్ ప్లాన్ గురించిన వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం.

## ఒక్కో షేరుపై రూ. 86 డివిడెండ్.. వారమే ఛాన్స్!

స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లకు డివిడెండ్ గురించి తెలిసే ఉంటుంది. ఇక్కడ కేవలం షేర్ ధర పెరగడంతోనే కాదు.. షేర్లు కలిగి ఉన్న వారికి కూడా కంపెనీలు అదనపు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. వీటిల్లోనే డివిడెండ్ ఒకటి. ఇక్కడ ఈ డివిడెండ్ డబ్బులు నేరుగా షేర్ హోల్డర్ల అకౌంట్లలోనే జమవుతుంటాయి. ఇప్పుడు టీవీఎస్ హోల్డింగ్స్ కంపెనీ.. మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ప్రముఖ టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రమోటర్ సంస్థ, పేరెంట్ కంపెనీ టీవీఎస్ హోల్డింగ్స్ బుధవారం రోజు కీలక ప్రకటన చేసింది. ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 86 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ మేరకు కంపెనీ.. ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరాల్ని వెల్లడించింది. మార్చి 25న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో టీవీఎస్ హోల్డింగ్స్ డివిడెండ్ ప్రకటన చేసింది. ఇక్కడ డివిడెండ్ పొందేందుకు రికార్డు తేదీ ఏప్రిల్ 2 గా ఉంది. అంటే.. ఇంకో వారం వరకు ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. అంటే ఆలోపు ఈ కంపెనీ షేర్లు కలిగి ఉన్న వారికి డివిడెండ్ అందుతుందన్నమాట. ఇక కంపెనీ డివిడెండ్ ప్రకటన చేసినప్పటి నుంచి నెల రోజుల్లో డివిడెండ్ డబ్బులు అకౌంట్లో పడతాయని కంపెనీ స్పష్టం చేసింది. గతేడాది కూడా ఈ కంపెనీ మార్చి నెలలో షేర్ హోల్డర్లకు మధ్యంతర డివిడెండ్ రూ. 93 చెల్లించింది. దానికి ముందు 2024 ఏప్రిల్ నెలలో రూ. 94 డివిడెండ్ ఇచ్చింది. ఇదే సమయంలో కంపెనీ మరో ప్రకటన కూడా చేసింది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (చీజణం) జారీ ద్వారా రూ. 650 కోట్ల మేర నిధుల్ని సమీకరించనున్నట్లు పేర్కొంది. టీవీఎస్ హోల్డింగ్స్ కంపెనీ విషయానికి వస్తే ఇది ఇండియన్ ఆటోమోటివ్ కాంపోనెంట్స్ కంపెనీ. ఇది టీవీఎస్ గ్రూప్‌లో భాగమే. సంస్థ ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది. టీవీఎస్ హోల్డింగ్స్ స్టాక్ ధర మార్చి 25న 2.80 శాతం మేర పెరిగి రూ. 14,108 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 27.77 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 16,297 కాగా.. కనిష్ఠ ధర రూ. 7904.70 గా ఉంది. నెల రోజుల్లో ఈ స్టాక్ 10 శాతం వరకు పడిపోగా.. 6 నెలల్లో 10 శాతం పెరిగింది. ఏడాదిలో మాత్రం 59 శాతం పుంజుకుంది. ఐదేళ్లలో 160 శాతం పెరిగింది. ఈ కంపెనీ మూడో త్రైమాసికం ఫలితాల విషయానికి వస్తే నికర లాభం వార్షిక ప్రాతిపదికన 27.7 శాతం పెరిగి రూ. 493.16 కోట్లుగా ఉంది. అంతకుముందు ఇదే సమయంలో లాభం రూ. 386.04 కోట్లుగా ఉంది. కార్యకలాపాల ఆదాయం 34.5 శాతం పెరిగి రూ. 15,275.63 కోట్లుగా ఉంది. మొత్తం వ్యయాలు చూస్తే 33.8 శాతం మేర రూ. 13,824.10 కోట్లుగా ఉంది.



## ఐటీ సెక్టార్‌లోని స్మాల్ క్యాప్ కేటగిరి కంపెనీ




బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ కంపెనీ బోర్డు డైరెక్టర్స్ 1:2 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు నిర్ణయించారు. అంటే ప్రతి 2 షేర్లకు 1 షేరు ఉచితంగా లభిస్తుంది. ఈ బోనస్ షేర్లరికార్డు డేట్ ఏప్రిల్ 2గా నిర్ణయించారు. ఆలోపు కొనుగోలు చేసిన వారికే అర్హత లభిస్తుంది. స్మాల్ క్యాప్ కేటగిరిలోని ఐటీ కంపెనీ బీ2బీ సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ (దీ2దీ ాశీట్‌ఖుతీవ ఃవఎష్ట్రఅశీశ్రీశీస్త్రఅవం ాఱఎఱ్‌వఎ) బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ కొద్ది రోజుల క్రితమే 1:2 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు ఆమోదం తెలపగా అందుకు సంబంధించిన రికార్డు డేట్ ఏప్రిల్ 2గా నిర్ణయించారు. ఈ తేదీ దగ్గర పడుతున్న క్రమంలో ఈ కంపెనీ స్టాక్ ఫోకస్ లోకి వచ్చింది. ఇవాళ్టి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో లాభాల్లో ట్రేడవుతోంది. అయితే ఏప్రిల్ 2వ తేదీన ఎక్స్ – బోనస్ ట్రేడ్ చేయనున్నాయి. అంటే ఏప్రిల్ 1వ తేదీ మార్కెట్ ముగిసే లోపు ఎవరైతే ఈ కంపెనీకి చెందిన 2 ఈక్విటీ షేర్లను తమ డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉంటారో వారికి 1 షేరు ఉచితంగా లభిస్తుంది. ఇలా 200 షేర్లు కొంటే 100 షేర్లు, 1000 షేర్లు కొంటే 500 షేర్లు ఉచితంగా బోనస్ రూపంలో పొందుతారు. మరోవైపు ఈ కంపెనీ షేర్ గత ఏడాదిలో 72 శాతం లాభాన్ని అందించింది. బీ2బీ సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ రూ. 100 లోపు ధర కలిగిన ఒక పెన్నీ స్టాక్. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ.45 స్థాయిలోనే ట్రేడవుతోంది. రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటు ధరలోనే ఉంది. దీంతో పెద్ద మొత్తంలో షేర్లు కొన్నవారికి మంచి ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం 1:2 రేషియోలో బోనస్ షేర్లు జారీ చేసేందుకు బోర్డ్ డైరెక్టర్లు ఆమోదం తెలుపారు. దీని అర్థం రికార్డు తేదీ నాటికి రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉండే 2 షేర్లను కొనుగోలు చేసినట్లయితే అదనంగా రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉండే 1 షేరును బోనస్ రూపంలో ఉచితంగా జారీ చేస్తారు. ఈ బోనస్ షేర్లు అందుకునేందుకు అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ ఏప్రిల్ 2, 2026గా నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది.

## గ్యాస్ సిలిండర్లపై మోదీ సర్కార్ అదిరిపోయే గుడ్ న్యూస్‌లు..

ప్రభుత్వం అదిరిపోయే తీపికబురు తీసుకువచ్చింది. గ్యాస్ సిలిండర్లపై 2 గుడ్ న్యూస్‌లు అందించింది. దీని వల్ల చాలా మందికి ఊరట లభిస్తుందని చెప్పుకోవచ్చు. సామాన్యులకు అదిరిపోయే తీపికబురు. ఏంటని అనకుంటున్నారా? 2 గుడ్ న్యూస్‌లు అందాయి. అవేంటో మనం ఇప్పుడు ఒకసారి తెలుసుకుందాం. యుద్ధ మేఘాల మధ్య భారత్‌కు ఊరటనిచ్చే వార్త. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. మన గ్యాస్ నౌకలు సురక్షితంగా గమ్యం చేరుతున్నాయి. ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా కేంద్ర ప్రభుత్వం పక్కా ప్లాన్ సిద్ధం చేసింది. ఇంధన రంగంపై కేంద్రం నుంచి తాజా నివేదిక వెలువడింది. గ్రీన్ సాన్వి, గ్రీన్ ఆశా అనే రెండు భారతీయ ఎల్పీజీ నౌకలు అత్యంత ప్రమాదకరమైన హోర్ముజ్ జలసంధిని దాటుకుని స్వదేశానికి వస్తున్నాయి. ఇవి ఏప్రిల్ 7, ఏప్రిల్ 9 తేదీల్లో భారత రేవులకు చేరుకోనున్నాయి. దీని వల్ల గ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మరో 16 భారతీయ నౌకలు ఉన్నప్పటికీ.. వాటి కదలికల కోసం ఇరాన్‌కు ఎటువంటి చెల్లింపులు చేయలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.



అంతర్జాతీయంగా సరఫరా ఇబ్బందులు ఉన్నా మన దేశంలో ఇంధన కొరత లేకుండా పెట్రోలియం శాఖ ముందస్తు చర్యలు తీసుకుంది. అదనపు గ్యాస్ నిల్వలను ముందే సమకూర్చుకోవడం వల్ల వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగదు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేస్తూ గ్యాస్ డీలర్ల వద్ద స్టాక్ తక్కువ కాకుండా చూస్తున్నాయి. ఆధునిక సాంకేతికత పుణ్యమా అని ఆన్‌లైన్ గ్యాస్ బుకింగ్‌లు రికార్డు స్థాయిలో 97 శాతానికి చేరుకున్నాయి. మార్చి 1 నుంచి దాదాపు 18 కోట్ల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేశారు. గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూనే.. ఎరువుల కర్మాగారాలకు గ్యాస్ సరఫరాను 90 శాతానికి పెంచారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విభాగానికి కూడా అదనపు కేటాయింపులు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పొరుగు దేశాల కంటే మన దగ్గర తక్కువగా ఉండటంతో పాటు తగినంత నిల్వలు ఉన్నాయి. దిగుమతుల్లో కొంత తగ్గుదల కనిపిస్తున్నా.. దేశీయ ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆ లోటును భర్తీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్యాస్ సిలిండర్లు, ఎల్పీజీ సిలిండర్, గ్యాస్ సిలిండర్, మోదీ ప్రభుత్వం, ఎల్పీజీ, గ్యాస్ ఖతర్ వంటి దేశాల నుండి గ్యాస్ సరఫరాలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా.. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడుతోంది. స్పాట్ ఎల్ఎన్జీ కొనుగోలు చేయడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన ఇంధనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల్లో ఒడిదుడుకులు ఉన్నా.. వ్యూహాత్మక నిల్వలను పెంచడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ విషయంలో కొంత నియంత్రణ పాటిస్తూనే గృహ వినియోగదారులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.